




నన్ను నా మిత్రులంతా 'హెన్ పెక్డ్ హస్బెండ్' అంటారు. దానికి కారణం లేకపోలేదు. భార్య చెప్పినట్లు చేయడం ఆమె చేతిలో పూర్తిగా కీలుబొమ్మలా తయారైనానంటే అందులో సందేహం లేదు. మా మిత్రులంతా అలా నన్ను పిలవడానికి ఇదే బలమైన కారణం కాబోలు. సావిత్రి నా భార్య. అయిన దానికీ, కాని దానికీ పోట్లాడడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. ఆ రోజు పని పిల్ల పెందరాళే వచ్చింది. పళ్లు తోముకుంటూ ఆమెతో సంభాషణ మొదలుపెట్టా. పని పిల్ల పేరు చంద్రమ్మ.

"చంద్రూ! ఏమిటి ఇవాళ కొత్త చీర కట్టుకున్నావ్?" అన్నా.

"ఇవాళ మా పెళ్ళి రోజు బాబుగారూ! అందుకనీ..." కాస్త సిగ్గుగా అంది పాత్రలు తోముతూ.

"ఇవాళ తొందరగా వెళ్ళిపోవాలా?"

"ఔను బాబూ! తొందరగా పని చేసుకునిరా! సినిమాకు వెళ్దాం అన్నాడు నా మొగుడు".

"సరే! తొందరగా పని ముగించు" అన్నా.

అంతలో రివ్వున కయ్యానికి కాలు దువ్వుతూ వచ్చింది మా సావిత్రి క్రోధారుణ నేత్రాలతో.

"ఆ పని దాంతో మీకేం పని? లోపలికి వెళ్ళి పళ్ళు తోమండి" చురచుర చూస్తూ అంది మా శ్రీమతి. కోపాన్ని దిగమింగుకుని మౌనంగా బాత్రూంలోకి వెళ్ళాను.

ఏమే! ఇవాళ కొత్త చీర కట్టుకుని షోగ్గా వచ్చావ్! పరాయి మగాళ్ళతో కులకడానికి నీకు సిగ్గులేదూ!" పని పిల్లను సావిత్రి నిలదీసింది.

"అమ్మగోరూ! మాటలు జాగత్తగా రానీండి. నేనేం మీ ఆయనతో సరసానికి దిగలే. కొత్త చీర విశేషం అడిగితే చెప్పా" అంది చంద్రమ్మ తోమిన పాత్రల్ని కడుగుతూ.

ఆ మరుసటి రోజే పని పిల్లను మాన్పించింది మా శ్రీమతి.

ఒకసారి ఏదైనా నిర్ణయం తీసుకుంటే అది శిలా శాసనం అన్నది నాకు బాగా అర్థమై పోయింది. మా ఊరు విజయవాడ అయినా ఉద్యోగరీత్యా నేను హైదారాబాద్ పి.ఐ.బి లో పని చేస్తున్నాను. నాకు మా ఊళ్ళో ఇల్లు కట్టుకోవాలని ఉండేది. కాని మా

హోం మినిస్టర్‌ది హైద్రాబాద్. హైద్రాబాద్‌లో ప్లాట్ కొనేశా. శ్రీమతి ఆదేశానుసారం నూతన గృహ నిర్మాణం, అందులో ప్రవేశం కూడా జరిగాయి. ఆమె నుంచి నాకు ఆవగింజంత సహకారం లేకపోయినా నేను మాత్రం ఆకాశమంత సహకారాన్ని ఆమెకు అంది స్తూనే ఉన్నా.

ఆ రోజు రాత్రి భోజనం ముగించి బెడ్‌రూంలో ఏదో పత్రిక తిరగేస్తున్నా. మా శ్రీమతి తాంబూలం చేతపట్టుకుని వచ్చింది. తాంబూలాన్ని నాకందిస్తూ "ఏమండీ! మా తమ్ముడు డిగ్రీ పూర్తి చేశాడు. ఈ రోజుల్లో ఉద్యోగం దొరకడం గగనకుసుమం కదా! అందుకని వాడికి ఓ ఎస్.టి.డి. బూతు పెట్టించాలనుకున్నా, ఓ యాభైవేలే ఖర్చయ్యేది. రేపు బ్యాంక్‌లో ఉన్న డబ్బు విత్‌డ్రా చేసి ఎస్.టి.డికి కావాల్సిన పనులన్నీ పూర్తి చేయండి. ఆఫీసుకు సెలవు పెట్టేయండి" గబగబా అనేసింది మా శ్రీమతి చాలా తేలిగ్గా.

ఈ సందేశం అందించాక మా శ్రీమతి మంచం మీదకు వాలింది. నిద్రలోకి ఎప్పుడు జారుకుందో కాని గురకలు వేయడం లయబద్ధంగా సాగుతోంది మొగుడనే ఒక ప్రాణి పక్కనున్నాడు, వాడి అవసరాలు తీర్చాలన్న కనీస జ్ఞానం కూడా ఆమెకు లేదాయె! నా రాత ఇంతే అనుకుని మౌనంగా లైట్లు ఆర్పి నిద్రకు ఉపక్రమించాను.

మరుసటి రోజు శ్రీమతి ఆదేశాలు తు.చ. తప్పకుండా అమలులోకి వచ్చేశాయి. మా బావమరిది శేఖర్‌కు ఒక ఎస్.టి.డి. బూత్ మా ఇంటి పక్కనే ఏర్పాటు చేశా. కాలం దొర్లుతూనే వుంది. అన్నీ ఆమె ఇష్ట ప్రకారమే జరుగుతున్నాయి. అయినా సావిత్రిలో ఏదో అసంతృప్తి కనిపిస్తూనే వుంది. ఎన్నో సార్లు చెప్పి చూశా 'నోరు మంచిదయితే ఊరు మంచిదని' కాని నా సలహాను ఒక బోడి సలహాగా భావించి మా శ్రీమతి యథా ప్రకారం నా మీద స్వారీ చేస్తూనే వుంది. నన్ను, నా వాళ్ళను ఏదో ఒక వంక పెట్టి సహస్రనామావళితో శాపాలు పెట్టకపోతే ఆమెకు దిక్కుతోచదాయె!

ఆ రోజు విజయవాడలోని మా నాన్నగారి నుంచి ఉత్తరం వచ్చింది. చదువుతుంటే మధ్యలో చటుక్కున సావిత్రి ఆ ఉత్తరాన్ని లాక్కుంది. అందులోని విషయాలు చదివాక ఉత్తరం మళ్ళీ విసురుగా నా ముఖాన పడేసి వంటింట్లోకి వెళ్ళిపోయింది. రెండు కాఫీ కప్పులతో మళ్ళీ ప్రత్యక్షమై ఒక కప్పు నా చేతిలో పెట్టింది. ఇంకో కప్పు తనే సిప్ చేయడం మొదలు పెట్టింది.

"సావిత్రీ! నాన్నగారికి ఏదో జబ్బు చేసిందట. అందుకే హైద్రాబాద్‌కు వచ్చి అపోలో హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైతే చికిత్స కూడా పొందాలని రాశారు. ఎలాగో పి.ఎఫ్‌కు అప్లయ్ చేశా. సుమారు నలభై వేల దాకా వచ్చింది. రేపు డ్రా చేస్తే నెక్స్ట్ వీక్ నాన్నగారి ట్రీట్‌మెంట్‌కు సరిపోతుంది" అన్నాను. అంతే! అగ్గి మీద గుగ్గిలంలా మారింది సావిత్రి.

"అపోలో ఎందుకు చేర్పిస్తారు? గవర్నమెంట్ హాస్పిటల్ వుందిగా! అయినా ట్రీట్‌మెంట్ కోసం వచ్చేటప్పుడు ఆ మాత్రం డబ్బులు ఆయన పెట్టుకు రారా ఏమిటి? పి.ఎఫ్ డబ్బుల్తో నేను పది తులాల బంగారం కొనాలి. నెక్లెస్, గాజులు చేయించాలిగా" అంది.

శ్రీమతి మాటలకు నివ్వెరపోయా. కన్నతండ్రి చికిత్స కోసం నా శాయశక్తులా సహాయం చేద్దామనుకున్నా. కాని అర్ధాంగి సహకారం లభించలేదు. మౌనంగా ఆయన వస్తే గవర్నమెంట్ ఆసుపత్రిలో చేర్పించాలని నిశ్చయించుకున్నాను. అనుకున్నట్లుగానే జరిగింది. సావిత్రికి పదితులాల బంగారంతో నెక్లెస్, చేతులకి నాల్గు గాజులు చేయించా. మా బావమరిది శేఖర్ ఎస్.టి.డి బూత్ బాగా నడుస్తోంది.

నాన్నగారు ఓ రోజు రావడం, గవర్నమెంట్ ఆస్పత్రిలో చేర్చడం జరిగింది. నాకు బాగా తెలిసిన డాక్టర్ మిత్రుడు ఉండడంతో తక్కువ వ్యయంతో ఆయనకు వైద్య పరీక్షలు, చికిత్స జరిగాయి. వ్యాధి 4,5 రోజుల్లో తగ్గు ముఖం పట్టింది. జాండిస్ నుండి నాన్నగారు కోలుకోవడంతో అమ్మ కళ్ళల్లో ఆనందభాష్పాలు చూశా. సావిత్రి మా నాన్న ఆస్పత్రిలో చేరిన మరుసటి రోజే విజయవాడకు వెళ్ళింది. ఏదో మహిళా సమాజం కాన్ఫరెన్స్ కోసం. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక నాన్నగారు రెండు రోజులు మా ఇంట్లోనే ఉండిపోయారు. అమ్మా నాకు ఆ రోజు భోజనం వడ్డిస్తోంది.

"అమ్మా! నాన్నగారిని అపోలో అడ్మిట్ చేయాల్సింది డబ్బులు సావిత్రి నగల కోసం ఖర్చయ్యాయి" అన్నాను సంకోచంగా.

"పర్వాలేదు బాబూ! నాన్నగారి జబ్బు నయమైందిగా! నువ్వు మా మూలంగా సావిత్రితో అనవసరంగా గొడవ పడడం నాకిష్టం లేదు. మేం ఈ రోజే బయల్దేరుతాం. మీరిద్దరూ సుఖంగా ఉంటే అదే పదివేలు" అంది అమ్మ. ఆ రోజు అమ్మానాన్నల్ని ఊరికి పంపించా. సావిత్రి తమ్ముడి కోసం ఎస్.టి.డి. బూత్ పెట్టించా. కాని మా నాన్నగారి చికిత్స అయ్యే ఖర్చుల్ని భరించడానికి సావిత్రి ససేమిరా అంగీకరించలేదు. నిద్రపోవాలనుకున్నా, రాత్రి 9 గంటలయింది. శ్రీమతి విజయవాడ నుంచి ఫోన్ చేసింది. తను రావడానికి రెండు రోజులు ఆలస్యమవుతుందట. తమ్ముడు శేఖర్‌కు ఓ లూనా కొనిపెట్టమని చెప్పింది. ఫోన్ క్రెడిల్ చేశా. ఆమెలోని విచిత్ర ధోరణికి ఎంతో బాధ పడ్డాను. 'హెన్‌పెక్డ్ హస్‌బెండ్'. అని నాలో నేనే నవ్వుకున్నాను. ❀

